# సాక్షి సంగారెడ్డి

బుధవారం । 22 । మే । 2024






## గింజకొంటే ఒట్టు..

హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లిలో గింజ ధాన్యం కూడా కొనలేదు. ఇదేమంటే కూలీల కొరత అంటున్నారు. వివరాలు 8లో ▸




## డ్రైవర్ ఉడాయింపు

బస్సులో కనీస సదుపాయాలు లేవని ప్రయాణికులు ప్రశ్నిస్తే ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉడాయించాడు. వివరాలు 8లో ▸



## రైతుల రెక్కల కష్టం..

తేమ పేరుతో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. అదనంగా బస్తా తరుగు ఇస్తేనే దిగుమతి చేసుకుంటామంటున్నారు. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణఖేడ్: నాగలిగిద్ద మండలం పూసల్‌పాడ్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ నిలిపివేయనున్నట్లు ఖేడ్ ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్ర కుమార్ తెలిపారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే క్రమంలో సరఫరాను ఆపేస్తున్నట్లు చెప్పారు.

### ఎల్లమ్మ ఆలయంలో బీబీ పాటిల్ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని ఎల్లమ్మ దేవాలయాన్ని మంగళవారం ఎంపీ బీబీ పాటిల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీని కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరుణ, విజయ్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: దొడ్డు వడ్లకు సైతం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖేడ్ ప్రాంతంతో పాటు రాష్ట్రంలో 90 శాతం దొడ్డు రకం వడ్లనే పండిస్తారని తెలిపారు. వాటికి బోనస్ ఇవ్వడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

### తోర్నాల్ వాసికి డాక్టరేట్



డిగ్గే బాబు

నారాయణఖేడ్: మనూరు మండలం తోర్నాల్ గ్రామానికి చెందిన డిగ్గే బాబుకు ప్రపంచ మానవహక్కుల పరిరక్షణ కమిషన్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన డిగ్గే బాబు ఉన్నత విద్యను అభ్యసించి వ్యాపారం చేస్తూనే మానవహక్కుల పరిరక్షణకు పాటుపడుతున్నారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో మానవహక్కుల ఉల్లంఘనలు జరిగిన సందర్భాల్లో బాధితులకు అండగా ఉన్నారు. కరోనా సమయంలో ఎందరికో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈయన సేవలను ప్రపంచ మానవ హక్కుల కమిషన్ గుర్తించి చైర్మన్ తపన్ కుమార్ రౌటారీ ఆధ్వర్యంలో బాబుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. తనకు డాక్టరేట్ రావడానికి ఎంతగానో ప్రోత్సహించిన తెలంగాణ అధ్యక్షులు నవోదయ సిద్దుకు బాబు కృతజ్ఞతలు తెలిపారు.

### బడుల్లో పనులు వేగిరం చేయండి



వివరాలు తెలుసుకుంటున్నఅదనపు కలెక్టర్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధి రుద్రారం జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల, వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు, కొత్తగా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్, ఎంఈఓ పీపీ రాథోడ్‌లను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ వెనుక ఉన్న స్థలంపై కొందరు కన్ను వేశారని, దానిని పాఠశాల అవసరాలకు వాడుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కోరారు. విచారించి, చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ రంగారావు, రాజ్ కుమార్ ఉన్నారు.

# విత్తన వెతలు

## జిల్లాలో పచ్చిరొట్ట కొరత

**క్యూలైన్‌లో పాసుపుస్తకాలు**
- వానాకాలం ప్రారంభానికి ముందే రైతులకు కష్టాలు
- డిమాండ్ మేరకు సరఫరా చేయని వ్యవసాయశాఖ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: వానాకాలం ప్రారంభానికి ముందే అన్నదాతలకు విత్తన కష్టాలు షురువయ్యాయి. ఒకవైపు ధాన్యాన్ని విక్రయించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న రైతులు.. మరోవైపు విత్తనాల కోసం కూడా తంటాలు పడుతున్నారు. ఏకంగా తమ పట్టాదారు పాసుపుస్తకాలను క్యూలైన్‌లో ఉంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా పచ్చిరొట్ట విత్తన పంపిణీ కేంద్రాల వద్ద పెద్ద క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. జోగిపేటలో మంగళవారం ఏకంగా రైతులు ఈ విత్తనాల కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై బైఠాయించారు. ఏటా ప్రభుత్వం వానాకాలం సీజన్‌లో జీలుగ, జనుము విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తుంది. తొలకరి జల్లులు కురిసిన వెంటనే రైతులు దుక్కులు దున్నుకుని ఈ పచ్చిరొట్ట విత్తనాలను వేసుకుంటారు. ప్రధానంగా బోర్లు, ఇతర సాగునీటి సౌకర్యం ఉన్నచోట్ల వరి సాగు చేసే రైతులు ఈ విత్తనాలు వేసుకుంటారు. అయితే రైతుల అవసరం మేరకు ఈ విత్తనాల సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు ప్రారంభమయ్యాయి.

**వచ్చింది అరకొరే..**

జిల్లాకు ఈ వానాకాలం సీజనులో 6,500 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఈ విత్తనాలను సరఫరా చేయాలని ఆ శాఖ కమిషనరేట్‌కు ఇండెంట్ పెట్టింది. అయితే కమిషనరేట్ నుంచి 3,900 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించారు. కానీ ఇప్పటి వరకు కేవలం 307 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. జనుము విషయానికి వస్తే 1,800 క్వింటాళ్లు అవసరమని జిల్లా నుంచి ఇండెంట్ పెట్టారు. కమిషనరేట్ నుంచి 1,981 క్వింటాళ్లు కేటాయించారు. కానీ వచ్చింది మాత్రం 890 క్వింటాళ్లు మాత్రమే.

**ఒక్కసారిగా పెరిగిన డిమాండ్**

జిల్లాలో వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పచ్చిరొట్ట విత్తనాలు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో ఈ విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. వీటికోసం మండల వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళుతున్నారు. రైతులు అధిక సంఖ్యలో ఈ విత్తనాల కోసం వచ్చిన ప్రాంతాల్లో ఇబ్బందులు వస్తున్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

**ఎన్నికల కారణంగా ఆలస్యం**

రెండు నెలలుగా లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. అధికారులంతా ఆ ఏర్పాట్లలో ఉండటంతో విత్తనాల టెండరు ప్రక్రియలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. వీటికితోడు అకాల వర్షాల కారణంగా విత్తనాల రవాణాలో ఆలస్యమైనట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ విత్తనాలు రాజస్థాన్ నుంచి రావాల్సి ఉంటుందని చెబుతున్నారు.



జోగిపేట్‌లో విత్తన పంపిణీ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఉంచిన పట్టాదారు పాసుపుస్తకాలు

### విత్తనాల కోసం రోడ్డెక్కిన రైతులు

జోగిపేట(అందోల్): జీలుగ, జనుము విత్తనాల పంపిణీలో జాప్యం జరగడంతో రైతులు రోడ్డెక్కారు. రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం జోగిపేట వ్యవసాయ కార్యాలయం వద్ద విత్తనాల కోసం టోకెన్లు అందజేస్తుండటంతో పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. ఉదయం ఆరు గంటల నుంచే అక్కడ నిరీక్షించారు. అయితే రైతులకు సరిపోను విత్తనాలు రాలేదు. టోకెన్లు ఇచ్చి విత్తనాలు ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి ఆందోళనకు దిగారు. వెంటనే ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, ఏఎస్‌ఐ గౌసొద్దిన్, ఏడీఏ అరుణ, ఏఓ విజయరత్నలు అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పి పంపించారు. మండలానికి రావాల్సిన కోటా పూర్తి స్థాయిలో రాలేదని, మిగతాది బుధవారం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.



జోగిపేటలో రైతుల రాస్తారోకో..

**వ్యవసాయశాఖ నిర్లక్ష్యం..**

రైతుల అవసరం మేరకు విత్తనాలను తెప్పించడంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం వహించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విత్తనాలను సకాలంలో జిల్లాకు రప్పించడంలో అలసత్వం చేశారని ఆరోపణలున్నాయి. అధికారులు ముందస్తుగానే వీటిని జిల్లాకు తెప్పించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు అంటున్నారు.

**ఉదయం నుంచి వేచి చూసిన..**



ఉదయం 6గంటలకు వచ్చి లైన్‌లో నిలబడిన. 11 గంటలకు టోకెన్లు ఇచ్చారు. టోకెన్ తీసుకుని రైతుసేవా కేంద్రానికి వెళితే విత్తనాలు అయిపోయాయని చెప్పారు. అవసరం మేరకు ఈ విత్తనాలు అధికారులు సిద్ధం చేయాలి.

– నవాబుగారి దుర్గయ్య, రైతు, దాకూరు

**స్టాక్ వచ్చాక ఇస్తామంటున్నారు..**



నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. విత్తనాలు తీసుకుందామని వచ్చా. టోకెన్లు ఇచ్చారు కానీ విత్తనాలు ఇవ్వలేదు. స్టాక్ అయిపోయిందని చెబుతున్నారు. వచ్చాక ఇస్తామని చెప్పారు. అనువు దాటాక ఇస్తే ప్రయోజనం ఉండదు.

– గుంతపల్లి సాలయ్య, రైతు, మన్‌సాన్‌పల్లి

**ఎలాంటి కొరత లేదు**

పచ్చిరొట్ట విత్తనాలకు ఎలాంటి కొరత లేదు. జిల్లా అవసరానికి మించే కమిషనరేట్‌కు ఇండెంట్ పెట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి రావాల్సి ఉండటంతో అక్కడక్కడ ఆలస్యం అవుతోంది. రైతుల అవసరం మేరకు విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింహారావు, డీఏఓ

## ఇంద్రేశంలో కేంద్ర బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న అధికారుల బృందం

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి ఇంద్రేశం గ్రామంలో కేంద్ర ట్రైనీ అసిస్టెంట్ అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. శిక్షణలో భాగంగా గ్రామ జనాభా, మౌలిక వసతులు, రైతుల స్థితిగతులు, ప్రజల ఆదాయ వనరులు తదితర అంశాలను అధ్యయనం చేయడానికి వారు ఇక్కడ పర్యటించారు. ప్రజల జీవనాధారం, గ్రామ అభివృద్ధి రేటు, వివిధ శాఖల సేవలు, సంక్షేమ పథకాలు ఎలా అమలవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. బుధవారం ప్రభుత్వ పాఠశాల పరిశీలన తోపాటు పంచాయతీలో మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, పల్లెప్రకృతి వనం, కమ్యూనిటీ భవనాలను పరిశీలించనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్ గౌడ్, గ్రామ కార్యదర్శి సుభాష్, అధికారులు విష్ణు, ఆకాంక్ష్, దిలీప్, లోకేష్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 2024– 25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఖాళీగా ఉన్న కొన్ని మైనార్టీ సీట్లతోపాటు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం నేరుగా పాఠశాల, కళాశాలలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 7995057963 నంబరుకు కాల్ చేయవచ్చని సూచించారు.

## నిబంధనల ప్రకారం కొనుగోళ్లు

మునిపల్లి(అందోల్): రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం జొన్నలు కొనుగోలు చేస్తున్నామని పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘం (సీఈఓ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి శివారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జొన్నలు కొనుగోళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 20 నుంచి ఇప్పటి వరకు 650 టన్నుల జొన్నలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. క్వింటాల్‌కు రూ.3,180 ధర ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు జొన్నలు కొనాలని ఆదేశాలున్నట్లు వివరించారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

**కలెక్టర్ వల్లూరి క్రాంతి**

వట్‌పల్లి(అందోల్): ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సదురు అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వల్లూరి క్రాంతి హెచ్చరించారు. మంగళవారం అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ మాధురితో కలిసి ఆమె సందర్శించారు. కేంద్రం వద్ద రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు వేగంగా జరగడం లేదని, లారీలు రాక రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామని రైతులు వాపోయారు. టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన కొనుగోలు కేంద్రాన్ని మరో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. స్పందించిన కలెక్టర్.. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లుకు తరలించాలని ఆదేశించారు.

**ప్రైవేట్ ఉద్యోగివా..? ప్రభుత్వ ఉద్యోగివా..?**

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై పీఏసీఎస్ సీఈఓ నర్సింలుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఉద్యోగివా..? ప్రభుత్వ ఉద్యోగివా.. అంటూ మండిపడ్డారు. టార్పాలిన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ధాన్యం వెంటనే తరలించాలి**

జోగిపేట(అందోల్): తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. అందోల్‌లోని కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు.వర్షాలు పడుతున్నందున కొనుగోళ్లలో వేగం పెంచాలని సూచించారు. గన్నీబ్యాగుల సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమాల్లో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ కొండల్‌రావు, డీఎస్‌ఓ వనజాత, మెప్మా పీడీ గీత, ఆర్డీఓ పాండు తహసీల్దార్ భాస్కర్, ఏడీఏ శ్రీలత, ఏఓ విజయరత్న ఉన్నారు.



అందోల్ కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

**షోకాజ్‌లు ఇవ్వండి**

జోగిపేట(అందోల్): అందోల్ డివిజన్‌లోని జెడ్పీ బాలురు, బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆ సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈఓ వెంకటేశ్వర్లుకు ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల పనులు దగ్గర ఉండి చేయించుకునే బాధ్యత హెచ్‌ఎంలదేనని అన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

పటాన్‌చెరు టౌన్: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను ఆమె సందర్శించారు. అక్కడ పోలీస్ భద్రత, సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి, సర్వేయర్ కోటేశ్వరావు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి**

నారాయణఖేడ్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఆ శాఖ జిల్లా అధికారి లలితకుమారి సూచించారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు శ్వేత, వాసవి, రామరాజు, రావణతో కలిసి మంగళవారం మండల పరిధి జుజాల్‌పూర్, మాణిక్‌నాయక్ తండా, శంకర్ నాయక్ తండా, తెట్టెకుంట తండా, జగన్నాథ్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఫ్యామిలీ సర్వేను తనిఖీ చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు కౌన్సిలింగ్ ఇవ్వడం, బరువు, ఎత్తులను కొలిచే యంత్రాలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీల టీచర్లు, సహాయకులకు సలహాలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు.



మాట్లాడుతున్న లలితకుమారి

# తూకంలో అవకతవకలకు తావివ్వొద్దు

**ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి**
- ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోళికేరి

దుబ్బాక: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోళికేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూకంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్నాయన్నారు. అకాల వర్షాలతో కొంత ఇబ్బందులు తలెత్తాయని అయినా రైతులు, అధికారుల సహకారంతో త్వరితగతిన చేశామన్నారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 2, 3 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారులు వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాలో జమ అయిన డబ్బులు తదితర వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్య, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీశ్, డీఎస్‌ఓ తనూజ, డీపీఎం కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



హబ్షీపూర్ కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న భారతి హోళికేరి

# కళ్లెదుటే దగా!

**తరుగు పేరిట దోపిడీ**
- కేంద్రాల్లో జొన్న, కుసుమ కొనుగోళ్లలో చేతివాటం
- బస్తాకు రెండు మూడు కిలోల కోత
- రైతులను నిలువునా దోచేస్తున్న నిర్వాహకులు



నారాయణఖేడ్: ప్రభుత్వాలు మారినా రైతులను దోచుకోవడం ఆగడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట నిలువునా దోచేస్తున్నారు. మనూరు మండల కేంద్రంలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న, నల్ల కుసుమ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు చేతివాటం చూపిస్తున్నారు. తరుగు, పొల్లు పేరిట బస్తాకు రెండు, మూడు కిలోల వరకు దోపిడీకి పాల్పడుతున్నారు. మనూరులో ఏప్రిల్ 15న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ మనూరు, నాగల్‌గిద్ద, నారాయణఖేడ్ మండలాలకు చెందిన రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేస్తారు. అలాగే నల్ల కుసుమలు కొనుగోలు చేసే ఏకైక కేంద్రం ఇదొక్కటే కావడంతో జిల్లాలోని పంట అంతా ఇక్కడికే తెచ్చి అమ్ముకోవాలి.

**కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర**

ఇప్పటివరకు ఈ కేంద్రంలో 397మంది రైతుల వద్ద 8వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశారు. 42మంది రైతుల నుంచి 620 క్వింటాళ్ల నల్ల కుసుమ కొనుగోలు చేశారు. జొన్నలు క్వింటాలు ధర రూ.3,180 కాగా, నల్లకుసుమ రూ.6,760 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. జొన్నలు బయటి మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.2వేల లోపే ఉండగా, నల్లకుసుమ రూ.4వేలు పలుకుతుంది. కేంద్రంలో మద్దతు ధర ఉండడంతో రైతులు ఇక్కడికే ధాన్యం తీసుకువస్తున్నారు.

**ఇష్టానుసారంగా వసూళ్లు**

బస్తాకు 50కిలోల జొన్నలు తూకం వేయాల్సి ఉండగా, తరుగు పేరిట 52 నుంచి 53కిలోల వరకు వేస్తున్నారు. దీనిపై రైతులు ప్రశ్నిస్తే... తరుగు, తాలు పోయి తర్వాత బరువు తగ్గుతుందని నిర్వాహకులు బదులిస్తున్నారు. కుసుమల తూకం కూడా ఇదే తరహాలో ఉంది. హమాలీ కూడా ఇష్టానుసారం వసూళ్లకు పాల్పడుతున్నారు. చేయి తడిపిన వారి ధాన్యం ముందుగా కొనుగోలు చేస్తున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. లేదంటే ఒక్కో రైతు ఐదారు రోజులు కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. దీంతో వాహనం వెయింటింగ్ చార్జీలు తడిసి మోపెడై నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తూకం ఆలస్యమైతే అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఇబ్బంది పెడుతున్నారు**



నల్ల కుసుమలు తెచ్చి రెండు రోజులు అవుతుంది. 28 క్వింటాళ్ల ధాన్యాన్ని రెండు వాహనాల్లో తెచ్చా. కొనుగోళ్లు జరగకపోవడంతో వాహనాల వెయిటింగ్ చార్జి పెరిగిపోతోంది. ధాన్యాన్ని శుభ్రం చేయాలని ఇబ్బంది పెడుతుండటంతో రూ.5వేల కిరాయికి క్లీనర్‌ను తెచ్చాను.

– మాణయ్య, రైతు, రుద్రారం

**నాలుగు రోజులవుతుంది**



4 ఎకరాల్లో జొన్న సాగు చేశా. 50 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడంతో కేంద్రానికి తీసుకొచ్చా. నాలుగు రోజులవుతున్నా తూకం వేయకపోవడంతో కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నాం. వర్షం వల్ల ఇబ్బంది పడుతున్నాం.

– పండరిరెడ్డి, రైతు, శెల్గిర

**తరుగు తీస్తున్నాం**

జొన్నలు కొనుగోలు చేశాక లారీల్లో లోడ్ చేసే సమయాల్లో బరువు తగ్గే అవకాశం ఉంది. అందుకు ముందే 50కిలోల బస్తాను 51.8కిలోల చొప్పున తూకం వేస్తున్నాం. హమాలీ రూ.50 తీసుకుంటున్నాడు. కొందరు రైతులు జొన్నలు ఇస్తున్నారు.

– శ్రీకాంత్, సేల్స్‌మెన్, డీసీఎంఎస్

## క్లుప్తంగా

### అగ్ని ప్రమాదంలో ఇల్లు, గడ్డివాము దగ్ధం

మంటలు ఆర్పేందుకు యత్నించిన యజమానికి గాయాలు



కాలిబూడిదైన రేకుల ఇల్లు

నారాయణఖేడ్: అగ్ని ప్రమాదంలో గడ్డి వాముతోపాటు ఓ రేకుల ఇల్లు దగ్ధమైంది. మంటలు ఆర్పేందుకు యత్నించిన యజమానికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలం పలుగుతండాలో జరిగింది. బాధితుడు, తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ శంకర్‌నాయక్‌కు రేకులతో కూడిన ఇల్లు ఉంది. పక్కనే గడ్డివాము వేశాడు. సోమవారం సాయంత్రం గడ్డివాముకు మంటలు వ్యాపించి అది కాస్తా రేకుల ఇంటికి అంటుకున్నాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న బియ్యం, జొన్నలు, పప్పుదినుసులు, దుస్తులు దగ్ధమయ్యాయి. మొత్తం రూ. లక్ష వరకు నష్టం సంభవించింది. ఇంటి యజమాని శంకర్‌నాయక్ మంటలు అర్పేందుకు యత్నించి గాయాల పాలయ్యాడు. తండా వాసులు ఖేడ్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చేలోపే గడ్డివాము, ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. శంకర్‌నాయక్‌ను చికిత్స నిమిత్తం ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు.

### అస్థిపంజరం లభ్యం



గుర్తుతెలియని అస్థిపంజరం


పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని అస్థిపంజరం లభ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామ శివారు.. గోపాలకృష్ణ వ్యవసాయ పొలం సమీపంలో మునగ చెట్టు కింద పూర్తిగా కుళ్లిన స్థితిలో అస్థిపంజరం సోమవారం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తి వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, చనిపోయి 15 రోజులు అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి



మృత్యువాత పడిన ఎద్దులు

హత్నూర( సంగారెడ్డి): విద్యుత్ షాక్ తో రెండు ఎద్లు మృతిచెందాయి. ఈ సంఘటన హత్నూరలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. హత్నూర గ్రామ శివారులో నివాసముంటున్న గంగిరెద్దుల వాళ్లకు రెండు ఎద్లు ఉన్నాయి. ఇవి రోజులాగే సోమవారం కూడా బ్రాహ్మణగూడ గ్రామాల మధ్యలో ఉన్న కొండని గారి కుంట సమీపంలోకి వెళ్లి మేత మేస్తున్నాయి. ఇక్కడే లూజైన విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి. ఎంతకీ ఇంటికి రాకపోయేసరికి మంగళవారం వెతకగా ఉదయం మృత్యువాత పడి ఉన్నాయని స్థానికులు తెలిపారు.



ధాన్యం రాశులు

షేర్‌ఖాన్‌పల్లికి రైతు సంజీవ. తనకున్న 3 ఎకరాల్లో వరి సాగు చేశాడు. సుమారుగా 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రూ.35 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. అతను ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వడ్లు తీసుకువచ్చి ఆరబెట్టాడు. ఇప్పటి వరకు నిర్వాహకులు ఒక్క బస్తా కూడా తూకం వేయలేదు. వర్షాల కారణంగా ఎండిన ధాన్యం తడిసి ముద్దయింది. ప్రస్తుతం మొలకలు వచ్చాయి. ఇది ఇతని ఒక్కడి పరిస్థితే కాదు గ్రామంలోని రైతులు అందరిదీ కూడా ఇదే విధంగా ఉంది.

# గింజకొంటే ఒట్టు..

## అకాల వర్షంతో తడిసిన ధాన్యానికి మొలకలు

- 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- నేటికీ షేర్‌ఖాన్‌పల్లిలో జరగని విక్రయాలు
- కూలీల కొరతే కారణమంటున్న అధికారి
- ఆందోళనలో రైతన్న

జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు తూకం వేసి కొంటున్నారు. కొంతలో కొంత రవాణా ద్వారా గోదాంలకు తరలిస్తున్నారు. కానీ హత్నూర మండలంలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. షేర్‌ఖాన్‌పల్లిలో వరి రైతుల నుంచి గింజ కూడా కొనలేదు. అందుకు కారణం కూలీల కొరత అని చెబుతున్నారు అధికారి. రైతులేమో కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి 15 రోజులైందని వాపోతున్నారు. గింజ కూడా కొనకపోవడంతో ఎప్పుడు కొంటారోనని దీనంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది.

హత్నూర( సంగారెడ్డి):

అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. అప్పులు తెచ్చి మరీ సాగు చేశామని కన్నీరు మున్నీరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట కొనుగోలు చేస్తున్న అధికారులు షేర్‌ఖాన్‌పల్లిలో ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోలు ప్రారంభించకుంటే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లిలో హత్నూర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం( సొసైటీ) ఆధ్వర్యంలో ఈనెల 5న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ఇప్పటికే (40 రోజుల క్రితమే) రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు తెచ్చి ఆరబెట్టారు. కేంద్రం ప్రారంభమై 15 రోజులు గడిచిపోయినా ఒక్క ధాన్యం బస్తా కూడా తూకం వేయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా హత్నూర మండలంలోని ధాన్యం కేంద్రాల వద్ద కొనుగోళ్లు వేగవంతం చేయడం లేదని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. గన్ని బ్యాగుల కొరత ఒక వైపు, లారీలు సక్రమంగా రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యం విక్రయించేందుకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఇంకో వైపు ఏర్పడింది. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసేలా చూడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

**కారణం అదే : శ్రీనివాస్, సీఈఓ**

హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కూలీల కొరత వల్ల ఇంకా ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదు. గ్రామంలో వరి కోతలు లేటుగా ప్రారంభమయ్యాయి. ఈనెల 5న కొనుగోలు కేంద్రం ప్రారంభించాం. కానీ కూలీల కొరత వల్లే ఇంకా కొనుగోలు చేయలేకపోయాం. ఒకటి.. రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. గ్రామంలో రెండు మూడు లారీల లోడు మాత్రమే ధాన్యం నిల్వలు ఉన్నాయి.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు

వడ్ల బస్తాలతో నిండిన సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్ కొనుగోలు కేంద్రం





ధాన్యం బస్తాలను పేరుస్తున్న వ్యక్తి

### చలించండి మహాప్రభో..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్ల బస్తాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వచ్చిన వడ్లు వచ్చినట్లు బస్తాలుగా పేరుస్తున్నారు. ఇందుకు కారణం.. అవసరానికి తగినట్లుగా లారీలు అందుబాటులో లేకపోవడమే. దీంతో మిల్లులకు తరలించాలంటే రెండు లేక మూడు రోజుల వరకు ఎదురు చూడాల్సిందే. అక్కడ కూడా త్వరితగతిన ధాన్యం దించుకోవటం లేదని తెలుస్తోంది. పైగా మూడురోజులు వర్షం సూచన ఉన్నప్పటికీ అధికారులు ధాన్యం తరలింపుపై సరైన దృష్టి కేంద్రీకరించడం లేదని రైతులు వాపోతున్నారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి.




అమ్మకానికి తెచ్చిన ధాన్యం

# ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉడాయింపు

- కనీస సౌకర్యాలపై నిలదీసిన ప్రయాణికులు
- గోవాకు వెళ్లలేకపోయిన 25 మంది




బస్సు వద్ద ప్రయాణికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బస్సులో కల్పించాల్సిన కనీస సదుపాయాలపై అడిగితే ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉడాయించాడు. దీంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకోలేకపోయారు. ఈ ఉదంతం రామచంద్రపురంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి గోవాకు సోమవారం రాత్రి బయలుదేరే ఓంశ్రీ ట్రావెల్స్ బస్సుకు 25 మంది ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకున్నారు. ఎల్‌బీనగర్‌లో బస్సు నిర్వాహకులు ప్రయాణికులను పిక్ అప్ చేసుకోవాల్సి ఉండగా మియాపూర్ వరకు రావాలని కోరారు. వారు ఇక్కడికే వచ్చి బస్సు ఎక్కారు. కానీ కనీస సౌకర్యాలు లేకపోవడం, లోపల అపరిశుభ్రంగా ఉండటం, వైర్లు బయటకి కనబడుతుండగా కొంతమంది ప్రయాణికులు డ్రైవరు దృష్టికి తీసుకెళ్లారు. అతను వారితో నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూనే దురుసుగా ప్రవర్తించాడు. బస్సు రామచంద్రాపురం.. అశోక్‌నగర్ వద్దకు చేరుకోగానే డ్రైవరు వాహనాన్ని పక్కకు ఆపి దిగి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. ప్రయాణికులు.. బస్సు నిర్వాహకుడు సునీల్ ఫోన్ చేయగా అతను కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. వేరొక డ్రైవర్ వస్తాడన్నాడు. కానీ మంగళవారం ఉదయం వరకు చూసినా ఎవరూ రాలేదు. దీంతో బస్సు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వైజాగ్‌కు చెందిన చరణ్ వర్మ బుధవారం గోవాలో జరిగే ఇండియాన్ కోస్ట్ గార్డు అసిస్టెంట్ కమాండెంట్ ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉండగా బస్సు ఇక్కడే ఆగిపోయింది. అయితే తోటి ప్రయాణికులు అందరూ కలిసి మంగళవారం రాత్రి గోవాకు వెళ్లేందు విమాన టికెట్‌ను బుక్ చేశారు. కాగా చరణ్ వర్మ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలో ఎఫ్ఆర్ఎస్‌ది రెండో స్థానం

- పండ్ల పెంపకంలో అత్యుత్తమ గుర్తింపు పొందింది
- కొండా లక్ష్మణ్ బాపూజీ వర్సిటీ వైస్‌చాన్సలర్ నీరజ



మామిడి పండ్ల ప్రదర్శనను తిలకిస్తున్న వైస్ చాన్సలర్ నీరజ

సంగారెడ్డి: అన్ని పండ్లలో రారాజు మామిడని, పండ్ల మొక్కల పెంపకంలో సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్ (ఫ్రూట్ రిసెర్చ్ సెంటర్) రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వర్సిటీ వైస్ చాన్సలర్ నీరజ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్‌లో ఫల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె ప్రసంగించారు. ప్రతి రైతూ మంచి మొక్కలను ఎంచుకొని నాటుకోవాలని సూచించారు. 242 రకాల పండ్లను ప్రదర్శనలో ఉంచామన్నారు. అధిక దిగుబడిలో దాసరి ముఖ్యమైనదని, మల్లిక లక్షల ఎకరాల్లో సాగవుతుందన్నారు. మంజీరా రకం పండ్ల తోటల పెంపకంలో మొదటి స్థానంలో ఉందన్నారు. పండ్ల తోటల మొక్కల పెంపకంలో కొత్త రకం ఎంపిక చేసే ముందు రిసెర్చ్ చేయాల్సి ఉందన్నారు. ఆ తర్వాత సత్ఫలితాల ఆధారంగా ఆమోద ముద్ర వేస్తామన్నారు. మొక్కల్లో తల్లి వేరు వ్యవస్థ బాగా లేకపోవడంతో చెట్లు పాడైపోతుంటాయన్నారు. వేరేగా మొక్కలను నాటుకోవాలని సూచించారు. కాగా, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రదర్శనలో కొండాపూర్ మండలం తేర్పోల్‌కు చెందిన రైతు నర్సింహారెడ్డి మాట్లాడుతూ తాను గతంలో ఒక నర్సరీలో మొక్కలు తెస్తే నిర్వాహకులు మోసం చేశారన్నారు. అదే ఎఫ్ఆర్ఎస్‌లో తెచ్చిన మొక్కల్లో అన్నీ బాగున్నాయన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకందారులకు రాయితీ కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఈ ప్రదర్శన బుధవారం సైతం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కుమార్, హార్టీకల్చర్ ఏడీఏ శ్రీధర్ , శాస్త్రవేత్తలు హరికాంత్, డాక్టర్ మాధవి, నితీష , హార్టికల్చర్ అధికారులు కీర్తి కృష్ణ, సమత పాల్గొన్నారు.

# నాలుగో అంతస్తుపై నుంచి పడి ..

- కూలీ దుర్మరణం
- అమీన్‌పూర్ పీఎస్ పరిధిలో ఘటన

పటాన్‌చెరు టౌన్: నాలుగో అంతస్తుకు లిఫ్ట్ ద్వారా ఇటుకలు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కూలీ కింద పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన అరుణ్ లేట్(22) బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌కు వచ్చాడు. ఇక్కడి బిల్డర్ తేజ రామ్.. పీజేఆర్ ఎంక్లేవ్ రోడ్ నంబర్ 7లో నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ వద్ద కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పని చేసే చోట నాలుగో అంతస్తుకు ఇటుకలు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికుడు రంజన్ ఇతరులు కలిసి వెంటనే క్షతగాత్రుడిని చందనగర్ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అరుణ్ మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బిల్డర్ ముందస్తు భద్రతా చర్యలు తీసుకోనందునే పై నుంచి కింద పడి చనిపోయాడని మృతుడి గ్రామస్తుడైన రంజన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బైక్‌ను ఢీకొన్న టిప్పర్

### ఒకరికి తీవ్రగాయాలు

పోచారం సమీపంలో ఘటన

పటాన్‌చెరు టౌన్: బైకును టిప్పర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పోచారం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పోచారం సర్వీస్ రహదారి సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొండాపూర్ మండలం ఉత్తరపల్లికి చెందిన మహేందర్‌ను టిప్పర్ సోమవారం రాత్రి ఢీకొంది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా వారు ఇక్కడికి చేరుకున్నారు. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

### రోకలిబండతో భార్య దాడి

భర్తకు తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం

మనోహరాబాద్‌లో ఉదంతం

మనోహరాబాద్(తూప్రాన్): భార్యాభర్తల మధ్య గొడవ జరుగగా భర్తపై భార్య రోకలి బండతో దాడి చేసింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్‌లో జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పర్కిబండ పంచాయతీ.. తుపాకులపల్లి గ్రామానికి చెందిన నిమ్మల శివయాదవ్, తన భార్య ఇద్దరూ సోమవారం రాత్రి గొడవ పడ్డారు. కోపోద్రిక్తురాలైన భార్య రోకలిబండను తీసుకొని భర్త తలపై మోదింది. దీంతో అతడి తల పగిలి రక్తం కారుతుంది. గమనించిన చుట్టుపక్కల వారు బాధితుడిని వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ గొడవపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

# పీఎస్ ఎదుట ఎస్ఐ భార్య నిరసన




పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఐ నాగరాజు మొదటి భార్య మానస, బంధువులు

న్యాయం చేయాలని వేడుకోలు

కొమురవెల్లి(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్ఐ నాగరాజు భార్య మానస మంగళవారం ఆందోళనకు దిగింది. తన భర్త రెండో పెళ్లి చేసుకొని, ఇద్దరు కుమారులను తీసుకెళ్లాడని, న్యాయం చేయాలని కోరింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఎస్ఐ నాగరాజు తనను పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారని మానస తెలిపింది. రెండేళ్ల నుంచి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడని, అనంతరం రెండో పెళ్లి చేసుకున్నాడని ఆరోపించారు. తన ఇద్దరు పిల్లను దూరం చేసి మరో సంసారం చేస్తూ తనకు అన్యాయం చేస్తున్నాడని వాపోయింది. రెండేళ్ల క్రితం కరీంనగర్‌లో పెట్టి తన ఇద్దరు పిల్లలను తీసుకెళ్లి విడాకులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. దీంతో తాను ఆత్మహత్యకు యత్నించగా.. పిల్లలను తనకు ఇప్పించి న్యాయం చేస్తామని బంధువులు చెప్పడంతో విరమించినట్లు తెలిపింది. ఈ విషయమై సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తకు ఫోన్ చేస్తే నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాడని పేర్కొంది. బంధువులతో కలిసి కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు రాగా ఎస్ఐ ఆరు రోజులుగా సెలవులో ఉన్నాడని చెప్పారని తెలిపింది. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని చెప్పింది. సీఐ శ్రీనివాస్ వివరణ కోరగా.. ఇటీవల మానస ఈ విషయం తన దృష్టికి తీసుకువచ్చిందని, కౌన్సెలింగ్ ఇచ్చామని, ఉన్నత అధికారుల ఆదేశానుసారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# అక్రమ ఇసుక డంపు స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): అక్రమ ఇసుక డంపుపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీస్‌లు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. మంగళవారం మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలపల్లి గ్రామ శివారులో 150 టన్నుల డంపును నిల్వ చేశారని సమాచారం మేరకు ఈ దాడులు చేశారు. ఆపై డంపును సీజ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ ఇసుక డంపును నిల్వ చేశారని అధికారులు తెలిపారు. అన్ని విధాలుగా విచారణ చేసి నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రజలు టాస్క్‌ఫోర్స్, పోలీసుల (87126-67445, 87126-67447, 87126-67446)కు సమాచారం అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



ఇసుక డంపును స్వాధీనం తీసుకున్న టాస్క్‌ఫోర్స్, పోలీస్ అధికారులు

### వ్యక్తికి రిమాండ్

సిద్దిపేటకమాన్: ఇసుక అక్రమ రవాణా చేస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం వెంకటాపూర్‌కు చెందిన సంపంగి నవీన్ కొంతకాలంగా కరీంనగర్ జిల్లా రేణిగుంట వాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడు. ఈ నెల 9న పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తూ అతను పట్టుబడ్డాడు. అయితే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ను నెట్టేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు కాగా నిందితుడు మంగళవారం ఇసుక లారీతో సహా సిద్దిపేట టూటౌన్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సీఐ తెలిపారు. అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

# ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపం

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సత్యం(ఫైల్)

దుబ్బాకరూరల్: ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని రామక్కపేటలో జరిగింది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రంగు సత్యం(45)కు, కుటుంబ సభ్యులకు మధ్య ఆస్తి పంపకాల విషయమై మంగళవారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో గొడవ జరిగింది. ఈ విషయంలో మనస్తాపానికి గురై అతను మధ్యాహ్నం 2 గంటలకు ఇంటిలో ఉన్న తన పిల్లలను బయటకు పంపించి తలుపులు వేసుకొని ఫ్యాన్‌కు చీర బిగించి ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని తన పిల్లలు ఇంటి బయట బీడీలు చుడుతున్న తల్లి లావణ్యకు చెప్పారు. ఆమె ఇరుగు పొరుగు వారిని పిలిచి తలుపులు తెరిచారు. ఫ్యాన్‌కు వేలాడుతున్న సత్యంను కిందకు దింపి దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.